


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**నెల్లూరు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:** జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గతేడాది అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధిపథంలో పయనించిందని, నెల్లూరు మేకపాటి గౌతమ్‌రెడ్డి బ్యారేజీలను, జెన్‌కో మూడో యూనిట్‌ను ముఖ్యమంత్రి జాతికి అంకితం చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సహాయ సహకారాలతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మకర సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు నింపాలని, పాడి పంటలతో అన్నదాతలు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు కార్పోరేషన్ జనవరి 13 ప్రభాతవార్త** మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడ్ని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.స్వర్ణభారతి ట్రస్టులో మాజీ ఉపరాష్ట్రపతిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

**నెల్లూరు జనవరి 13, ప్రభాతవార్త-వైద్యం** ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎవరైనా స్కానింగ్ పరీక్షలు చేసి లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో పీసీ అండ్ పిఎన్‌డిటీఈ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచామన్నారు. స్కానింగ్ సెంటర్లపై వైద్యశాఖ బృందాలతో తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీలు సందర్భంగా ఎక్కడైనా లింగ నిర్ధారణ జరిగిన తెలిస్తే అలాంటి సెంటర్లను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ లింగ నిష్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, పెద్దాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబు, గైకాలజిస్టు గీతాలక్ష్మి, పీడియాట్రిస్ట్ చందన్‌రెడ్డి, నెల్లూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, దయాకర్, రూప, కవితారెడ్డి, కుసుమకుమారి, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త కాంతులు నింపాలి

**నెల్లూరు జనవరి 13, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లా ప్రజలకు నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త కాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు, సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. తెలుగులోగిళ్ళు శుభాలకు, సుఖసంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంట సంక్రాంతిని శోభాయమానాలతో ఉత్సాహంగా జరుపుకోవాలని, సంక్రాంతి లక్ష్మి కొలువు తీరాలని, అందరి కోరికలన్నీ నెరవేరాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నానన్నారు.

## సంక్రాంతికి కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు



**కావలి, జనవరి 13 ప్రభాతవార్త** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందెలు, పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు గైకొనడం జరుగుతుందని కావలి డిఎస్పీ వెంకట రమణ హెచ్చరికలు చేశారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కోడిపందెలు, పేకాటలు, రికార్డ్ డాన్సులు నిర్వహిస్తే పోలీస్ చట్టపరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం అందజేయాలని వారి పేర్లు గోప్యంగా వుంచుతామని డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. కావలి గ్రామదేవత కళుగోళ శాంభవి గ్రామోత్సవం సందర్భంగా కావలి పట్టణ పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి శాంభవి ఆలయం వరకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తూ పోలీస్ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజలు, భక్తులు సహకరించాలన్నారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకొని ప్రజలు సుఖంగా వుండాలని డిఎస్పీ కోరారు. అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో కావలి వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సైకో పాలన పోవాలి




**నెల్లూరు జనవరి 13, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలో జగన్ చేస్తున్నసైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తేనే రాష్ట్రం రామరాజ్యంగా మారుతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుయువత జిల్లా అధ్యక్షుడ కాకర్ల.తిరుమలనాయుడు ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ కేంద్ర కార్యాలయంలో భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీద.రవిచంద్ర పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పట్టిన చీడ జీవో నంబర్-1 రాజ్యాంగ హక్కులను హరిస్తూ సైకో సీఎం జీవో నంబర్-1ని విడుదల చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాడన్నారు. రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని ఆరోపించారు. జిల్లాలో దళితులు, సామాన్యులపై వైసీపీ నేతలు దాడులు చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కేందుకు జీవో నంబర్-1ని విడుదల చేశారని విమర్శించారు. అనుమతుల పేరిట టీడీపీ కార్యక్రమాలను అడ్డుకోవడం, ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై లాఠీ చార్జ్‌కు పాల్పడడం వైసీపీ దుర్మార్గ పాలనకు పరాకాష్టన్నారు. గత టీడీపీ ప్రభుత్వం నిరసన సభలను, ర్యాలీలను, పాదయాత్రలను అడ్డుకునే ప్రయత్నాలు ఏనాడు చేయలేదన్నారు. చేసి ఉంటే జగన్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర సాగేదాని ప్రశ్నించారు. భోగి పండుగ సందర్భంగా తెలుగు ప్రజలు తమ ముంగిళ్లలో జీవో నంబర్ వన్ కాపీలను దగ్ధం చేసి సైకో పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

## జిల్లా ప్రజలకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల శుభాకాంక్షలు



**నెల్లూరు కారో ్పరేషన్ జనవరి 13 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లా ప్రజలకు రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరు సంక్రాంతి సంబరాలు ఆనందోత్సహాలతో జరుపుకోవాలని వారు కోరారు.ఈ పండు నుండి ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని,మంచిగా పంటలు పండాలని, ప్రజలందరు ఆనందంగా ఉండాలని వారు కాంక్షించారు.

## కోవూరుపల్లి గిరిజన కాలనీలో విషాదం



**బిట్రగుంట, జనవరి 13 ప్రభాతవార్త** కోవూరుపల్లి గిరిజన కాలనీలో శుక్రవారం విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చినబలరామయ్య అందించిన సమాచారం మేరకు గిరిజన కాలనీకి చెందిన పోట్లూరి సంతోష్(16) అనే యువకుడు తన తండ్రి 25 వేల రూపాయలు విలువ చేసే సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదని ఎలుకుల నిర్మూలనకు ఉపయోగించే క్రిమి సంహారక మందు తీసుకున్నాడని తెలిపారు. ఆ యువకుడిని కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో నెల్లూరులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందాడని తెలిపారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి సంబరాలు జరుపుకునే సమయంలో జరిగిన విషాదం కలిచివేసింది.

# స్వర్ణ భారత్ ట్రస్టు ద్వారా పేదలకు ఎంప్లాయిమెంట్





**వెంకటాచలం, జనవరి 13, ప్రభాతవార్త:** స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఎంప్లాయిమెంట్ అవకాశం కల్పించడం సంతోషకరమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఎంతో మంది పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. వెంకయ్య నాయుడు ఎక్కడున్నా తెలుగు బాషా, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టత గురించి అర్థమయ్యే విధంగా వివరిస్తారన్నారు. ఢిల్లీలో ఉన్నా ఉగాది పండుగలను తెలుగుదనం ఉట్టిపడేలా ఏర్పాటు చేయడం తెలుగు వారి పట్ల ఆనందాన్ని కలిగిస్తుందన్నారు.బ్రిడ్జిస్కూల్, కౌసల్యా సదస్సులో నిర్వహిస్తున్న యువత నైపుణ్య శిక్షణలు ఎంతో మంది జీవితాలకు వెలుగులు నింపుతున్నాయన్నారు. స్వామి వివేకానంద సూక్తులను మార్గదర్శకంగా తీసుకుని నేటి తరం యువతకు వాటిని ఆలోచింపజేయడం అభినందనీయమన్నారు.

**ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయం : మంత్రి కాకాణి**

ట్రస్టులో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని, ట్రస్టులో రాజకీయాలకతీతంగా సేవాభావంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఎంతో అభినందనీయ మన్నారు. వెంకయ్యనాయుడు జిల్లాకు అనేక కేంద్ర పథకాలను తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేశారన్నారు. ఎక్కడ ఉన్నా సంక్రాంతి సంబరాలకు జిల్లాకు వచ్చి సొంత గ్రామంలో స్నేహితులతో తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలు నేటి తరం యువత తెలుసుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించి పండుగల విశిష్టతను తెలపడం శుభపరిణామన్నారు.

# ఉద్యోగులకు ఆదాయ పన్నుకు సంబంధించి అవగాహన



**నెల్లూరు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఆదాయ పన్ను చెల్లింపుల్లో ఆయా శాఖల డీడీవోలదే పూర్తి బాధ్యత అని విజయవాడ ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆదాయ పన్నుకు సంబంధించి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన ఇన్‌కం ట్యాక్స్ బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆదాయ పన్ను చెల్లింపుకు సంబంధించి పాత విధానం, కొత్త విధానం రెండూ అమలులో ఉన్నాయని, ఉద్యోగులు వారికి లాభదాయకమైన విధానంలో పన్ను చెల్లించాలని సూచించారు. డీడీవోలు వారి టాన్ నెంబర్‌ను తెలుసుకుని ఉండాలని, ఇన్‌కం ట్యాక్స్ లాగిన్ ఐడి, పాస్‌వర్డ్‌లతో ప్రతి నెలా ఉపయోగిస్తూ, అవసరమైతే పాస్‌వర్డ్ మార్చుకోవాలని సూచించారు. ఉద్యోగుల వ్యక్తిగత ఈ మెయిల్, మొబైల్ నెంబర్‌నే ఆదాయ పన్ను చెల్లింపులో నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ విభాగాల డీడీవోలతో ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూపును రూపొందించి, ఆదాయ పన్ను చెల్లింపులకు సంబంధించి అన్ని సందేహాలను నివృత్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి కూడా ఆదాయ పన్ను విషయంలో అప్రమత్తంగా ఉంటూ, ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటూ ప్రభుత్వ నిబంధన మేరకు పన్ను చెల్లించాలన్నారు. అనంతరం ఉద్యోగులు అడిగిన అనేక ప్రశ్నలను ఆదాయ పన్ను శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆదాయ పన్ను శాఖ అధికారి ఎస్.రాజశేఖర్, జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ గంగాధర్, ఏటీవో లోకేష్‌బాబు, ఎస్‌టీవో రహమాన్, డీడీవోలు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామదేవత కళుగోళ శాంభవి ఉత్సవానికి ఆటంకాలు లేకుండా జరపాలి



**కావలి, జనవరి 13 ప్రభాతవార్త** సంక్రాంతి పండుగ రోజున కావలి గ్రామదేవత శ్రీ కళుగోళ శాంభవి మాత ఉత్సవానికి ఎటువంటి అవరోధాలు లేకుండా జరిగేందుకు అందరు సహకరించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శీనానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అధికారులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామదేవత కళుగోళ శాంభవి మాత ఉత్సవం అత్యంత వైభవంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అందుచేత గ్రామోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో కావలి డిఎస్పీ వెంకట రమణ, తహశీల్దార్ మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, మున్సిపల్ డిఇ శ్రీనివాసులు, వైసిపి నేతలు జనిగర్ల మహేంద్రయాదవ్, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఈతముక్కల బాలమురళిరెడ్డి, కుందుర్తి కామయ్య, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందెం పోటీలు

**కోవూరు, జనవరి13 ప్రభాతవార్త** సంక్రాంతి సందర్భంగా కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న అరవింద రైసుమిల్లు ప్రాంతంలో రాష్ట్రస్థాయి ఎడ్ల ప్రదర్శనను నేడు నిర్వహిస్తున్నట్లు కోవూరు రైతు సమన్వయ కమటీ నేతలు శుక్రవారం తెలిపారు. గత 25 సంవత్సరాలుకు పైగా ఈ పోటీల్ని నిర్వహిస్తూనే ఉన్నామని రాష్ట్రస్థాయిలో గుంటూరు, చీరాల ప్రకాశం, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఎడ్లు కూడా ప్రదర్శనలో పాల్గొన్నాయని వారు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, వెండి కప్పులు అందచేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. మొత్తం 30 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో తెప్పోత్సవం

**ఉలవపాడు,జనవరి13,ప్రభాతవార్త** ఉలవపాడులో ఉన్న ప్రసిద్ధి చెందిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా పలు ఉత్సవాలునిర్వహిస్తున్నారు.శనివారం నుండి సోమవారం వరకు పలు కార్యక్రమాలు జరుపుతున్నారు.సుప్రబాతసేవ,స్వామివారి తిరు ఆరాధన,గోదా అమ్మవారి కళ్యాణం,గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త కె.సుధీష్‌చంద్రారెడ్డి కార్యనిర్వహకాధికారి జానకమ్మ తెలిపారు.పండుగ సందర్భంగా చివరి రోజు తెప్పోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరుపుతున్నామని చెప్పారు.

## మహేష్‌నాయుడుపై 307 కేసు నమోదు చేయాలి

**కావలి,జనవరి 13 ప్రభాతవార్త** దళిత యువకుడు గోచిపాతల తేజపై దాడి చేసిన వైసిపి నేత మహేష్‌నాయుడుపై 307 కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉలవపాళ్ళలోని తేజ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు. తేజకు న్యాయం జరిగే వరకు అండగా వుంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత యువకుడు గోచిపాతల తేజపై మహేష్‌నాయుడు అత్యంత అమానుషంగా దాడి చేశాడన్నారు. విచక్షణారహితంగా చావబాది ఇనుప రాడ్‌తో చంపే ప్రయత్నం చేస్తే కనీసం హత్యాయత్నం కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు.తేజపై జరిగిన దాడి దృశ్యాలు చూసి కూడా మహేష్‌నాయుడు, ఆయన అనుచరులపై న్యూసెన్స్‌వంటి చిన్న కేసులు పెట్టడం పట్ల పోలీస్ చర్యల్ని ఖండిస్తున్నామన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెట్టిన అట్రాసిటీ కేసులో కూడా స్టేషన్ బెయిల్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు.దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు పోలీసులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కావలి నియోజకవర్గంలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. దళితులపై దాడులు చేస్తున్న నిందితుల పట్ల పోలీసుల మెతక వైఖరి అవలంభించడం దారుణమన్నారు. దీంతో బడుగు, బలహీనవర్గాలపై దాడులు నిరంతరం జరుగుతూనే వున్నాయన్నారు. ఇప్పటికైనా గోచిపాతల తేజపై దాడి చేసిన మహేష్‌నాయుడుపై 307 కేసు నమోదు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు హెచ్చరికలు చేశారు. తేజను పరామర్శించిన వారిలో సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, సిపిఐయంయల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కరవది భాస్కర్,నరసింహరావులు పాల్గొన్నారు.

# వైసీపీకి కాపలా కుక్కల్లా పనిచేస్తున్న కొంతమంది పోలీసుల అధికారులు



**నెల్లూరు జనవరి 13, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలో ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి పోలీసు అధికారులు వైసీపీకి కాపలా కుక్కల్లా పనిచేస్తున్నారని, ఆ నియోజకవర్గంలో కాకాణికి వాచ్ డాగ్స్‌లా పనిచేస్తూ అకారణంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని, ఇలాంటి పోలీసులు అధికారులను వదిలే ప్రసక్తే లేదని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీసులపై ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్నడూ లేని విధంగా జిల్లాలోని కొంతమంది పోలీసు అధికారుల పనితీరుపై, జిల్లా ఎస్పీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలు పూర్తిగా అవినీతి ఊబిలో పూరుకుపోయి మంత్రి కాకాణి ఆడించినట్లల్లా ఆడుతూ తాము ప్రభుత్వ అధికారులమని మరచిపోయి వైసీపీ గుమస్తాల్లా పనిచేస్తూ నూతనంగా కాకాణి సీఆర్‌పీసీని అమలు చేస్తున్నారని, ఇలాంటి అవినీతి పోలీసు అధికారులకు త్వరలోనే తగిన విధంగా బుద్ధి చెపుతామని హెచ్చరించారు. సర్వేపల్లి నియోజకవర్గ అవినీతి పోలీసుల అధికారులకు ప్రైవేటు కేసులు నమోదు చేసి వారిని కోర్టు బోనులో ముద్దాయిలుగా నిలబెట్టేరోజు దగ్గరలోనే ఉందన్నారు. నిజాయితీ పరులైన పోలీసు అధికారులు, పోలీసు అసోసియేషన్ నాయకులు జిల్లాలో జరుగుతున్న అవినీతి పోలీసు అధికారుల ఆగడాలపై ఇప్పటికైనా నోరు విప్పాలని అవినీతిని చూస్తూ ఊరుకోవడం కూడా తప్పేనన్నారు. అవసరమైతే నిజ నిర్ధారణ కమిటీ ఎదుట తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో సహ నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెంటనే పోలీసు అసోసియేషన్ స్పందించి జిల్లా ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగించాలని సోమిరెడ్డి కోరారు. జనం కోసం పనిచేయాల్సిన పోలీసులు కొంతమంది అవినీతికి అలవాటుపడి ప్రజల దృష్టిలో రక్షకులుగా కాక భక్షకులుగా తయ్యారై పోలీసులంటేనే తమ శత్రువులనే స్థాయిలో ప్రజలు ఊహించుకునే విధంగా ప్రవర్తించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన వైకాపా నేత యనమల.రాజేంద్ర ఆధ్వర్యంలో గత వారంలో మూడువందల మంది వైకాపా అభిమానులు ఆపార్టీని వీడి టీడీపీలో చేరేందుకు వెంకటాచలం లోని టీడీపీ కార్యాలయానికి వస్తుండగా వారిని దారిలో సీఐ గంగాధర్ అడ్డగించి నానా బూతులు తిట్టి వారిని బయపెట్టడంతోపాటు అనేకమంది యువకులకు చెందిన మోటారు సైకిళ్ళ తాళాలను బలవంతంగా లాక్కుని పరిసర ప్రాంతాల్లోని కాలువల్లో విసిరివేయడం ఈ అవినీతి సిఐ పిచ్చి పరాకాష్టకు చేరిందనేందుకు ఉదాహరణనన్నారు. కార్యకర్తలు తమ కార్యాలయాల్లో ప్రోగ్రామ్ చేసుకున్నా వారిపై 307 సెక్షన్ కింద నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసి, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నా సర్వేపల్లి పోలీసు అధికారులు, అదే సందర్భంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు చేసే కార్యక్రమాలకు కాపలా కుక్కల్లా ఉంటున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అవినీతి కాపలా కుక్కలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండే అర్హత లేదని, కాకాణికి దాసోహం అంటూ ఊడిగం చేస్తున్న అవినీతి పోలీసులన్నారు. వెంటనే తమ కాకీ బట్టలు వదిలి వైకాపా కండువాలు కప్పుకోవాలని అవహేళన చేశారు. జిల్లా ఎస్పీ విజయరావు ఈ జిల్లాకు వచ్చిన తరువాత తాను ఒక ఐపీఎస్ అధికారని పూర్తిగా మరచిపోయి దిగజారిపోయి పనిచేస్తుండడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో అనేకమంది బడుగు, బలహీన వర్గాలపై వైకాపా రౌడీ మూకల దాడులు చేస్తున్నా హత్యలు చేస్తున్నా చూస్తూ ఈ ఎస్పీ నోరు మెదపలేదని సోమిరెడ్డి ప్రశ్నించారు. హత్యలు చేస్తున్న వైకాపా రౌడీ మూకలకు అండగా వారిపై చర్యలు చేపట్టలేని ఎస్పీ ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటేనన్నారు. ఇకపై వైకాపా నాయకులు తమ నాయకులు, కార్య కర్తలపై దాడులకు పాల్పడితే తాము ఎదురుదాడికి దిగుతామని హెచ్చరించారు. నాయకులు బొమ్మి.సురేంద్ర, దొడ్డపనేని రాజానాయుడు, రాధాకృష్ణమనాయుడు, రాజేంద్ర, రమేష్‌లు పాల్గొన్నారు.

## భోగి పండుగకు సర్వం సిద్ధం

మనుబోలు, జనవరి 13 ప్రభాతవార్త: శనివారం భోగి పండుగ చేసుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే పట్టణాలలో నివసిస్తున్న వారు పల్లెటూరుకు చేరుకున్నారు. పల్లెలు కళకళలాడుతున్నాయి. భోగి రోజు మంటల్లో కాల్చేందుకు తాగలను సిద్ధం చేసుకున్నారు. శనివారం భోగి, ఆదివారం సంక్రాంతి పండుగలు వచ్చాయి. ఈ రెండు రోజులు మాంసాహారం తినగం చాలా మంది ఇష్టపడరు. ఈ నేపథ్యంలో భోగి, సంక్రాంతి పండుగలకు మాంసాహారం తినడం వాయిదా వేసుకున్నారు. కనుమ పండుగ రోజు చికెన్, మటన్ తినేందుకు నిర్ణయించుకున్నారు. మండల కేంద్రమైన మనుబోలులో తాటాకుకు డిమాండైంది. తాటిచెట్లు పుష్కలంగా వున్నప్పటికీ తాటాకు తెచ్చుకునే పరిస్థితి కనపడలేదు. విద్యార్థులకు సెలవులు కావడంతో క్రికెట్ పోటీలు, గాలిపటాలు ఎగురవేస్తూ పలు గ్రామాల్లో సందడి కనిపిస్తోంది. నాలుగు రోజుల పాటు పండుగలతో పల్లె ప్రజలు బాగా ఎంజాయ్ చేయనున్నారు. రెండేళ్ల కరోనా అనంతరం సంక్రాంతి పండుగను బాగా ఎంజాయ్ చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొలనుకుదురు, కట్టపల్లి గ్రామల్లో మాండస్ తుఫాన్ వల్ల కొందరు రైతులు బాగా నష్టపోయారు. అయినప్పటికీ ఏడాదికి ఒకసారి వచ్చే సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు ఇష్టపడుతున్నారు.

## విజయవంతంగా గడపగడప కార్యక్రమం



**వలేటివారిపాలెం జవనరి 12, ప్రభాతవార్త:** అమ్మపాలెం పంచాయతీలోని బంగారక్కపాలెంలో సైడు కాలువులు లేక తీవ్ర ఇబ ్బందులు పడుతున్నామని పలువురు గ్రామస్తులు కందుకూరు శాసనసభ్యులు ఎం.మహీధర్‌రెడ్డికి వివరించారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులుతోపాటు ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ ఇంటూరి భారతితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలో కచ్చారోడ్ల మరమ్మత్తులకు గుర్రైనాయని, సైడు కాలువులు లేక వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.రజకబజారు, ఎస్సీల బజారు,పాఠశాల బజారుతోపాటు పలుబజార్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. ఇందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌తోపాటు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలను ఎమ్మెల్యే ఆదేశించారు.గడపగడపను సందర్శిస్తున్నపుడు చాలామంది పక్కాఇళ్లు మంజూరుచేయాలని,భూసమస్యలు పరిష్కరించడంలో ఎదురవుతున్న జాప్యాన్ని నివారించాలని,విద్యార్దులకు బస్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తిచేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా అని ఎమ్మెల్యే గడపగడపలో కుటుంబ యజమానిని అడగడం, వారు అన్ని సక్రమంగా అందుతున్నాయని వివరించారు.అమ్మపాలెంలో అనంతరం అమ్మపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటిని సందర్శించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎస్సీకాలనీ, బీసీ కాలనీ, గ్రామంతో పాటు ప్రతి కుటుంబాన్ని పలకరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తమ ఇళ్లకు వచ్చి తమను పరామర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని పలువురు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓబులుకొండయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి,ఎంపీటీసీలు చింతలపూడి రవీంద్ర, యానాదయ్య, చుండి, అయ్యవారిపల్లె, ఉప్పలపాడు సర్పంచ్‌లు ఇరపని సతీష్,దేగా బుజ్జి, వింజం వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం,పోకూరు ఉపసర్పంచ్‌లు గురిజాల కిష్టయ్య, ఉన్నం శరత్,ఎంపీడీవో రఫీక్ అహ్మద్, తహసిల్దార్ సుందరమ్మ, ఎస్ఐ సుదర్శన్, ఆర్ఐ నరసయ , ఈవోఆర్డీ కె.సుమంత్,విద్యుత్ ఏఈ మధుబాబు, హౌసింగు ఏఈ శ్రీనివాసులు, పీఆర్‌ఏఈ గోపిచంద్‌రెడ్డి, కార్యదర్శి రవికుమార్, అబ్దుల్ బరీ, సచివాలయ సిబ్బంది శోభారాణి, వైసీపీ సీనియర్ నేతలు ఇంటూరి హరిబాబు,నలమోతు చ oద్రమౌళి, అనుమోలు వెంకటేశ్వర్లు,పరిటాల వీరాస్వామి,ఇరపని అంజయ్య, ఎల్లయిసీ మాల్యాద్రి,గుత్తా గోపి,కట్టా హనుమంతరావు,బాపతు మాలకొండారెడ్డి, పల్లాల వెంకటేశ్వర్లురెడ్డి, రోళ్లపాడు వేణుగోపాలరెడ్డి,చెన్నుబోయిన శ్రీనివాసులు, పర్రె జగదీష్, పోకూరు నుంచి అత్తోటి చెన్నయ్య అప్పనబోయిన రామయ్య, అంకభూపాలపురం తిరపతరెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

## మర్రిపాడు ఎస్ఐగా విశ్వనాధరెడ్డి



**మర్రిపాడు,జనవరి13ప్రభాతవార్త:** మర్రిపాడు మండల పోలీస్ సబ్‌ఇన్స్ పెక్టర్ వి.విశ వ్వనాథరెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు . నెల్లూరు విఆర్ నుంచి ఆయన బదిలీపై మర్రిపాడు ఎస్ఐగా నియమి తులయ్యారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటరమణ 5నెలల క్రితం సస్పెండ్ అయ్యారు. ఆయన స్థానంలో ఆత్మకూరు ఎస్ఐగా ఉన్న రాజేష్‌ను మర్రిపాడుకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రస్తుతం తాజాగా గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న విశ్వనాథరెడ్డి గురువారం నెల్లూరు విఆర్‌కు బదిలీ అయ్యి అక్కడి శుక్రవారం మర్రిపాడు ఎస్ఐగా జిల్లా ఎస్పీ విజయారావ్ బదిలీ చేశారు. ఈసందర్భంగా విశ్వనాథరెడ్డి స్థానికవిలేకర్లతో మాట్లాడుతూ మండల శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామ న్నారు. నెల్లూరు-ముంబాయి, దుత్తలూరు-బద్వేల్ రహదారిపై రాత్రి సమయాల్లో గస్తీలను విస్తృతం చేస్తామ న్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. భోగి, మకరసంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా యువత కోడిపందాలకు , పేకాటలకు యువత దూరంగా ఉండాలని విశ్వనాథరెడ్డి కోరారు.

## ఇందుకూరుపేటకు తరలించిన వివిధ జాతుల కోళ్ళు



ఇందుకూరుపేట జనవరి 13 ప్రభాతవార్త: సంక్రాంతి పురస్కరించుకొని కొడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ శాఖ హెచ్చరిక జారీ చేస్తున్నపట్టికి ఇందుకూరు పేట మండలానికి చెందిన పందెంరాయుళ్లు ఆవేమి లెక్క చేయకుండా వివిధ జాతుల కోళ్ళను దిగుమతి చేశారు.పందెలు ఆడేందుకు అన్ని సన్నాహాలు ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.గతంలో కూడా ఈ పందెలు ద్వారా కొట్లాదిరూపాయాలు చేతులు మారి కొన్ని కుటుంబాలు ఆర్దికంగా నష్టపోయిన దాఖలాలు ఉన్నాయి. కోళ్ళకాళ్లకు కత్తులు కట్టకూడదన్న న్యాయస్దానం ఉత్తర్వలు కూడా లెక్క చేయకుండా మానవత్వం మరచి పోయి మూగా జీవాలను పందెలకు పెట్టి, మద్యం మత్తులో వికృతానందం పొందాలన్న రీతిలో పందెరా యుళ్ళు వ్యవహారిస్తున్నారు. స్దానిక ప్రజలు కోడిపందెలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.పందెరాయుళ్లకు కొందరు స్దానిక నేతల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. స్దానిక నేతలు వత్తాసు పలకడంతో పందెలకు భరి తెగిస్తున్నట్లు తెలుస్తుంది.ఈ విషయంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పండుగ సమయంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన అవసరతం ఎంతైనా వుంది.

## చేవూరులో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం



**గుడ్లూరు, జనవరి 13, ప్రభాతవార్త** మండలంలోని చేవూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి మారుతీరావు పాల్గొని 62మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా దీర్ఘకాలిక జబ్బులతో ఉన్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సమాచారం అందించాలని, వారి ఇళ్లకు వైద్యులు వచ్చి ఆరోగ్య సమస్యలపై చర్చించి పలు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలికంగా జబ్బులతో బాధపడుతున్న వారికి పలు జాగ్రత్తలు తెలియజేశారు. వారం రోజుల నుంచి దగ్గు, జ్వరం ఉన్న వారు వైద్యులను సంప్రదించాల చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేకాలంకారంలో జొన్నవాడ కామాక్షితాయి



**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త:**పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారు భక్తులకు శుక్రవారం ప్రత్యేకాలంకరంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేకాభిషేకం, నవావరణ ఖడ్గమాల పూజలు, సహస్రనామార్చనపూజలు,మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన పల్లకీసేవ నిర్వహించారు.భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దంపతులు, దేవస్దాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు,ఎక్స్ అఫిషాయా సభ్యులు పర్యవేక్షించారు.

## వైద్య రంగంలో ధృవతార డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు



**కావలి, జనవరి 13 ప్రభాతవార్త :** వైద్య రంగంలో ధృవతార డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు అని యువ వైద్యులకు, శాస్త్రవేత్తలకు ఆయన మార్గదర్శకులు అని వక్తలు తెలిపారు. డాక్టర్ రామ్‌సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి చిన్నమ్మ ఆరోగ్య సదనం సహకారంతో కావలి రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మేఘనాథ్‌చౌదరి, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సివో సునీత, తదితరులు పాల్గొని మాట్లాడారు. డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు టెట్రాసైక్లిన్, హెట్రాజాన్, ఫోలిక్ ఆమ్లము, విటమిన్ బి 12 వంటి అనేక అద్భుత ఔషదాలను ప్రపంచానికి అందజేసిన గొప్ప వైద్యులన్నారు. ప్రపంచ శాస్త్రవేత్తల ప్రశంసలు పొందిన గొప్ప భారతీయ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు అన్నారు. దోమకాటు వల్ల సంక్రమించే బోదకాలు, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు వాడే హైట్రాజన్‌ను కూడా కనిపెట్టారన్నారు. అంతేకాకుండా క్షయ రోగ నివారణకు శాశ్వితమైన బసోనికోటి నికాసిడ్, హైడ్రాక్స్ డ్ మందులను కనిపెట్టి ప్రపంచ వ్యాప్తంగా అద్భుత ఔషదాల సృష్టికర్తగా యల్లాప్రగడ సుబ్బారావు పేరు తెచ్చుకున్నారన్నారు.

## సంక్రాంతి పండుగ విశిష్టతను ముగ్గుల పోటీలు చాటిచెబుతాయి



**కావలి, జనవరి 13 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ విశిష్టతను ముగ్గుల పోటీలు చాటిచెబుతాయని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు మహిళలలో దాగివున్న ప్రతిభాపాటవాలు వెలికితీసినట్లవుతుందన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వైసిపి నేత అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా నాయకత్వంలో కావలి డివిజన్, మండల వైసిపి ఆర్యవైశ్య సంఘాల నేతల ఆధ్వర్యంలో శుక్రవారం కావలి కారొనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, వైసిపి నేత, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నెల్లూరు జిల్లా రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సురేష్, కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరవ్యాధ్యక్షులు న్యాయవాది పేరకం వేణుగోపాల్, తాటి శ్రీరామమూర్తి, రైతు నాయకుడు కేతిరెడ్డి రామకోటారెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. సంక్రాంతి పండుగ వస్తుందంటే ప్రతి మహిళ ఇంటి ముందు తెల్లవారుజామునే వివిధ రకాల రంగుల ముగ్గులతో అత్యద్భుతంగా ముగ్గులు వేస్తారన్నారు. ఈ ముగ్గులు వేయడంలో మహిళలు ఎంతో ఆసక్తిని, ఆనందాన్ని చూపిస్తారన్నారు. ఈ పోటీలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని ముఖ్యఅతిథులు చేతుల మీదుగా అందజేశారు. ఈ ముగ్గుల పోటీలలో 105 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఐదు మందికి కన్సలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి చీర, ఒక జూట్ బ్యాగ్,గ్లాసు అందజేశారు.కావలి వాసవీ లెజండ్స్ క్లబ్ అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షి బృందం పాల్గొని సహకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎయంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి నీరజ, పొనుగోటి అనూరాధ,పందిటి కామరాజు, వైసిపి వైశ్య నేతలు కనమర్లపూడి వెంకట నారాయణ, డాక్టర్ మనోహర్‌బాబు, రామకృష్ణ, తిరివీధి ప్రసాద్, పెట్టుగాని రమేష్, కిషోర్, వైశ్య నేతలు గాదంశెట్టి మధుసూదన్‌రావు, ఒరుగంటి సురేష్, ఒరుగంటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న మహిళలు ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మితో ముచ్చటించారు.

## ముందుకు వచ్చిన భోగి

**చేజర్ల, జనవరి13ప్రభాతవార్త:** మండలంలోని కొన్ని గ్రామాల్లో భోగిపండుగ ముందుకు వచ్చింది. ప్రతి ఏటా మూడురోజులపాటు నిర్వహించుకునే సంక్రాంతి పండుగ లో భోగి, కనుమ రోజున మాంసాహార ప్రియులు పండుగను ఘనంగా జరుపుకుంటారు. అయితే ఈ ఏడాది భోగిపండుగ శనివారం, కనుమ పండుగ సోమవారం రావడంతో పండుగ రోజున మాంసం ముట్టకుంటే ముద్ద దిగదని కొన్ని గ్రామాల్లో ముందురోజే దండోరావేయించుకొని గురువారం రాత్రే భోగి మంటలు వేసి శుక్రవారం భోగి పండుగ చేసుకున్నారు . అదే గ్రామంలో మరికొంతమంది మాత్రం శాస్త్రం ప్రకారమే పండుగ చేసుకోవాలని శనివారం భోగి పండుగను చేసుకుంటున్నారు. మొత్తంమీద ఈ ఏడాది ఒక్కో పండుగ ను రెండురోజులు జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాదిలాగా ఈ ఏడాది అనుకున్న మేర పండుగను నిర్వహించుకోలేకపోయారు. గ్రామాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు కొంతకాలంగా వర్క్‌ఫ్రం హో చేస్తూ ఇటీవలే కంపెనీలకు వెళ్ళిపోవడంతో తిరిగి పండుగరోజు రావడానికి పెద్ద సుముఖత చూపకపోవడం వలన కూడా కొన్ని గ్రామాల్లో సంక్రాంతి సందడి తగ్గిందనే చెప్పుకోవాలి.

## ఘనంగా భోగిమంటలు





















శుక్రవారం రాత్రి ఘనంగా భోగిమంటలు వేశారు. ఉదయం నుంచే నగరంలో సందడి వాతావరణం నెలకొంది. సండే మార్కెట్ జనాలతో కిక్కిరిసింది. ట్రంకురోడ్డు, మినీబైపాస్‌రోడ్డు, అయ్యప్పగుడి సెంటర్లలో తాటాకుల కొనుగోలుతో పండగ వాతావరణం నెలకొంది.

ఫోటోలు: నందా మాల్యాద్రి

## ఆదరణ కేంద్రంలో మంచాల వితరణ



**బిట్రగుంట, జనవరి 13 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో శుక్రవారంహైదరాబాద్‌లో నివాసం వుంటున్న షేక్ పర్వేజ్ కుటుంబ సభ్యులు నాలుగు మంచాలు, భోజన ప్యాకెట్లు అనాధలకు వితరణగా అందజేశారని ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు తెలిపారు. ఎస్.కె.సమీవుల్లా బాషా మిత్ర బృందం సహకారంతో దాత అనాధలకు మంచాలు సమకూర్చడం పట్ల ఆయన వారిని అభినందించారు.

## పియం కిసాన్ లబ్దిదారులకు ఈకెవైసి తప్పనిసరి



**బిట్రగుంట, జనవరి 13 ప్రభాతవార్త** పియం కిసాన్ లబ్దిదారులందరూ తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని కావలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కన్నయ్య సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కౌలు రైతులు కూడా విఆర్వోల ద్వారా కౌలు కార్డు పొంది ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డ్రోన్ పైలెట్ శిక్షణ, పశుపోషణ సంరక్షణ, పశు బీమా పథకం తదితర అంశాలు గురించి చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖాధికారిణి విజయలక్ష్మి,పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉప్పాల మాచర్ల, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో ఎమ్మెల్యే సీటు నాయీ బ్రాహ్మణులకు ఇస్తామని ప్రకటించడం హర్షనీయం



**కావలి రూరల్, జనవరి 13 ప్రభాతవార్త** రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణాలో మొట్టమొదటి ఎమ్మెల్యే సీటు నాయీ బ్రాహ్మణులకు ఇస్తామని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, తెలంగాణా టిడిపి పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌లకు రెండు రాష్ట్రాలలోని నాయీ బ్రాహ్మణులు ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరి బాలగురుస్వామి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాయీ బ్రాహ్మణులకు ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఘనత టిడిపిదేనని తెలిపారు. మొట్టమొదటి సారిగా మా జాతికి ఎమ్మెల్యే సీటు ఇస్తామని ప్రకటించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపి పార్టీకే దక్కుతుందని తెలిపారు. అన్ని రంగాలలో బిసిలు ముందుకు వెళ్తున్నారంటే అది టిడిపి వల్లేనని తెలిపారు. తెలుగుదేశం పార్టీని, చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని నమ్ముతు న్నామన్నారు. రెండు రాష్ట్రాలలో మా నాయీ బ్రాహ్మణ జాతి మొత్తం ఆయన వెంటే నడుస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం చంద్రబాబునాయుడు తమ జాతికి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## సిఫార్సు మేరకే ఎరువులు వాడుకోవాలి



**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదు మేరకే ఎరువులు వాడుకోవాలని కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కోవూరులోని రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ ఎన్. హరి ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఇచ్చేసలహాలు సూచనలు ప్రతి రైతు తప్పక పాటించాలన్నారు. విచక్షణా రహితంగా పురుగుమందులు వాడడం వలన మిత్ర పురుగులు కూడా నశించే అవకాశం ఉందన్నారు. పైర్లకు ఏమైనా తెగుళ్ల సోకితే వ్యవసాయ శాఖ ఇచ్చిన సూచనల మేరకు మందులు వాడుకోవాలన్నారు. చైర్మన్ హరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించడమే కాకుండా ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ కూడా తప్పక చేయించుకోవాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతులు వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్. నరసింహులురెడ్డి, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, సుధీర్‌రెడ్డి, ఏఏవో చైతన్య, రైతులు ఉన్నారు.

## ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త : వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు ఏసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా పురుగుమందులను తమ ఇష్టానుసారంగా పిచికారి చేయడం వలన మిత్ర పురుగులు కూడా క్షీణించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ క్రాప్, ఈ కేవైసీ నమోదు చేసుకుంటే వాటి ద్వారా రైతులకు అనేక ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు.ఏఏవో సుభాషిణి, రైతులు ఉన్నారు.

## అసాంఘీక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవు



**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త :** సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందాలు, డైమండ్ డబ్బా వంటి అసాంఘీక కార్యక్రమాలు చేపడితే అటువంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కోవూరు సీఐ కె. రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మండలాల్లో ఇటువంటి కార్యక్రమాలను చేపట్టిన వాటిని ప్రత్యక్షంగా చూసిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పట్ల ప్రజలు అప్రమత్తంగాఉండి ప్రజలు వెంటనే సమాచారంఇవ్వాలని ఆయన సూచించారు.

## స్వర్ణయంత్రానికి వితరణ



కందుకూరు,జనవరి13,ప్రభాతవార్త కందుకూరు పట్టణ ఇలవేల్పు శ్రీ అంకమ్మతల్లి ఆలయ పున:నిర్మాణానికి పలువురు భక్తులు విరాళం అందిస్తున్నారు.అమ్మవారి పాదాల చెంత ప్రతిష్టింపచేసే స్వర్ణ యంత్రానికి శుక్రవారం ఓ కుటుంబసభ్యులు విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చారు.వలేటివారిపాలెం మండలం కలవల్ల గ్రామానికి చెందిన అబూరి మాధవరావు ధర్మపత్నిమాధవి 5,121రూ ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఆవుల మాధవరావుకి అందజేశారు.ఈ సందర్భంగా మాధవరావు ఆ కుటుంబసభ్యులను అభినందించారు.

## ఆటోవాలాలు అధికలోడుతో ప్రయాణిస్తే చర్యలు



**వింజమూరు,జనవరి13ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిధిలోని ఆటో వాలాలు నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో ప్రయాణిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జంపానికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పలువాహనాలను తనిఖీ చేశారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకెళ్ళడాన్ని గమనించి ఆటోవాలాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మంచు వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నా యన్నారు .ఇలా ప్రయాణీలకు ఎక్కువగా ఎక్కిస్తే ప్రమాదాలకు గురవుతారన్నారు. పోలీసుల నిబంధనలను పాటించి ఆటోవాలాలు వాహనాలను నడపాలని తెలిపారు .

## పెయ్య దూడలతో పాడి ఉత్పత్తి

**తోటపల్లిగూడూరు, జనవరి 13, ప్రభాతవార్త:** పెయ్య దూడల ఉత్పత్తి ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి చెంది పాడి రైతులు సుభిక్షంగా ఉంటారని నెల్లూరు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని పోట్లపూడి గ్రామంలో శుక్రవారం పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెయ్య దూడల ఉత్పత్తిపై అవగాహన, పుష్టికరమైన అందాల దూడల పోటీలు నిర్వహించారు. మాజీ విజయ డెయిరీ చైర్మన్ సొసైటీ అధ్యక్షులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు మహేశ్వరుడు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావలసిన మేలైన పెయ్యదూడలను 90 శాతం పుట్టించి తద్వారా పాల దిగుబడి పెంచుకోవచ్చని సూచించారు. మేలైన పశు సంపద ఔత్సాహిక పశు పోషకులను ఎంపిక చేయడం లక్ష్యంగా తమ శాఖ పని చేస్తుందన్నారు. జిల్లాలో 303 రైతు భరోసా కేంద్రాల ద్వారా పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చింతల దీవిలో 25 రకాల మేలు జాతి పశు సంతతిని పెంచడం జరుగుతుందన్నారు. ఆ శాఖ డీడీ బి.వి.సురేష్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్య నాళికలు కలిగిన ముర్రా జెర్సీ హెచ్ఎఫ్ జెర్సీ క్రాస్ హెచ్ఎఫ్ క్రాస్ సాహివాల్ తదితర జాతుల వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఎల్‌డీవో సోమయ్య మాట్లాడుతూ మూడు ఈతల లోపు గర్భకోశ వ్యాధులు లేని పశువులను గుర్తించి ఎదకు వచ్చిన 60 నుంచి 90 రోజులలోపు వీర్య నాళికల ద్వారా రెండు పర్యాయాలు సబ్సిడీపై కృత్రిమ గర్భదారణ చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో పశువుకు ప్రభుత్వ సబ్సిడీపై రూ.500కు అందిస్తామన్నారు. ఒకవేళ గర్భం ధరించని పక్షంలో చెల్లించిన పైకం వాపస్ చేస్తామన్నారు. ఇందుకూరుపేట ఏడీ మురళీకృష్ణ, పశు వైద్యులు వసంతరాయలు తమ తమ సందేశాలలో బ్రూ సెల్లా వ్యాక్సిన్ అవసరాన్ని గుర్తు చేశారు. విశాఖపట్నంలో ప్రత్యేక శిక్షణకు గ్రామాల నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి పంపుతామన్నారు. మాజీ విజయ డెయిరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా తమ గ్రామాల నుంచి విజయ డెయిరీకి 2000 లీటర్ల పాల సరఫరా చేయడాన్ని పేర్కొన్నారు. పాడి అభివృద్ధికి స్థానిక రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించామన్నారు. సుధీర్‌రెడ్డి అనుభవం కలిగిన రైతుగా అనేక విషయాలు వివరించడం పట్ల పశు సంవర్ధక అధికారులు ఆయనను ప్రత్యేకంగా ప్రశంసించారు. పాడి రైతులకు టిఎంఆర్ పంపిణీ చేశారు. ఉత్తమ మేలు జాతి దూడల అందాల పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన తాతా సరోజనమ్మ, రెండో బహుమతి ఆదిశేషమ్మ, మూడో బహుమతి శివనారాయణతో పాటు కన్సోలేషన్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు శ్రీనివాసరావు, నరేష్, షఫి, పశు వైద్య సిబ్బంది, ఆయా కంపెనీ ప్రతినిధులు పాకం ప్రవీణ్, పాడి రైతులు పాల్గొన్నారు.

## స్టూడెంట్ చాంఫియన్‌షిష్ విజేతలను ప్రకటించిన లీడ్

**నెల్లూరు,జవనరి13 ప్రభాతవార్త-విద్య** దేశంలోనే అగ్రగామి ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ వారి చాంఫియ న్‌షిప్-2022 విజేతలను వెల్లడించింది. జాతీయస్థాయిలో లీడ్ బాగస్వామ్యం కలిగిన 3000కుపైగా పాటశాలల్లో 1.2 మిలియన్ల ప్రీప్రైమరీ విద్యార్థులకు ఈ చాంఫియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ కో-ఫౌండర్,సిఈఓ సుమీత్ మోహతా మాట్లాడుతు తమ చాంఫియన్‌షిప్‌లో విజేతలైనవారికి శుభాకాంకలు తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో పోటీ పడి విజయం సాధిచటం సాదారణ అంశమేమి కాదన్నారు. దేశంలోని చిన్న ప్రాంతాలు ,పట్టణాల్లోని విద్యార్థుల కష్టం, అంకితభావావంతో వారు విజయం సాధించటం అందులో తాము బాగస్వామ్యం కావటం గర్వంగా ఉందన్నారు. ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.పురుషోత్తమ్ మాట్లాడుతు లీడ్ చాంఫియన్‌షిప్-2022 లో విజయం సాధించివారు భవిష్యత్‌లో నిర్వహించే పరీక్షల్లో, పోటీ పరీక్షల్లో సైతం విజయం సాధించాలన్నారు. వీరి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా ఉండాలని కోరారు. అలాగే విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తమ సంస్థ రూ. 10లక్షల విలువచేసే బహుమతులు అందించటం జరిగిందన్నారు. ఇదులో ల్యాప్‌టాప్‌లు,ట్యాబ్‌లు,గుడీస్, తదితర వస్తువులుఉన్నాయన్నారు.చాంఫియన్‌షిప్ స్ఫూర్తితో తాము త్వరలో లీడ్‌చాంఫియన్‌ట్రోఫీని కూడా అందించటం జరిగిందన్నారు.నగరంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీషుమీడియం స్కూల్‌లో విద్యార్థులు మానస కెవీఎస్ఎస్, హాసినిలు సైన్స్ చాంప్స్ సీనియర్ విభాగంలో ఫైనలిస్టులుగా నిలిచారన్నారని పేర్కొన్నారు.

## పేకాట స్థావరాలపై దాడులు

**అనంతసాగరం,జనవరి13ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరం శివారులో శుక్రవారం అనంతసాగరం ఎస్ఐ సంతోష్‌రెడ్డి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. 9మంది పేకాటరాయుళ్ళను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

## గడపగడపలో జెడ్పీటీసీ,ఎంపీపీ



వలేటివారిపాలెం జవనరి 12, ప్రభాతవార్త ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమపథ కాలు ఆస్వాదించాలని తద్వారా ముఖ్యమంత్రి జగనన్నను ఆశీర్వదించాలని వలేటివారిపాలెం ఎంపీపీ పి.మౌనిక, జెడ్పీటసీ ఇంటూరి భారతి ప్రజలకు సూచించారు. శుకృవారం మండలం లోనిఅమ్మపాలెం పంచాయతీలోని అమ్మ పాలెం బంగారక్కపాలెం గ్రామాలలో ఎంపీడీవో రఫీక్ అహ్మద్ అధ్యక్షతన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మహీధ ర్‌రెడ్డి సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఎంపీపీ, జెడ్పీ టీసీ తదితరులు ఒక బృందంగా ముందు నడుస్తూ సంక్షేమపథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. తదుపరి ఎమ్మెల్యేతోపాటు పలువురు అధికారులు ప్రతి గడపను సందర్శిస్తూ పథకాల లబ్దిని వివరిస్తూ, సమస్యలు వింటూ పరి ష్కారాన్ని అధికారులకు నిర్దేశిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బాగంగా ఎంపీపీ,జెడ్పీటీసీలు అమ్మపాలెంలలో ప్రజలకు జగనన్న పథకాలు ఆస్వాదించాలని తద్వారా ఆయనను ఆశీర్వ దించాలని సూచించారు. పలువురు అధికారులు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## సైకో జగన్‌రెడ్డి పాలన పోవాలి...సైకిల్ రావాలి



**కావలి, జనవరి 13 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సైకో పాలన పోవాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ సైకిల్ పాలన రావాలని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి టిడిపి కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి భోగి మంటలు వేశారు. ఈ భోగి మంటల్లో వైసిపి ప్రభుత్వ జీవో నెం.1 కాపీలను దగ్ధం చేశారు. సైకో పోవాలి...సైకిల్ రావాలంటూ టిడిపి నేతలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మాలేపాటి మీడియాతో మాట్లాడారు. ఈ రాష్ట్రంలో జగన్‌రెడ్డి సైకో పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో నలుగురు కలిసి స్వేచ్ఛగా తిరిగేందుకు వీలులేకుండా చీకటి జీవోలను తీసుకొచ్చి అమలు పరుస్తున్నారన్నారు. ఈ చీకటి జీవోలు ప్రజాస్వామ్యానికి ముప్పు కల్గిస్తాయన్నారు. ప్రతిపక్ష నేతల, ప్రజాసంఘాల నేతల గొంతు నొక్కే విధంగా ఈ జీవోను తీసుకొచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ప్రశ్నించే హక్కుతో పాటు నిరసనలు వ్యక్తం చేసే హక్కు వుందన్నారు. ఇలాంటి హక్కును జగన్‌రెడ్డి కాలరాయాలంటే ప్రజలు రానున్న ఎన్నికలలో ఇంటికి పంపుతారని హెచ్చరించారు. చలో కావలికి దళితులు పిలుపునిచ్చారన్నారు. కావలి పట్టణంలో ఎన్నడూ చూడని విధంగా వేలాది మంది పోలీసుల్ని దింపాల్సిన అవసరం వుందా అని మాలేపాటి ప్రశ్నించారు. దళితులపై మారణహోమాన్ని సృష్టిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతిబాబురావు, గుత్తికొండ కిషోర్‌బాబు, మన్నవ రవిచంద్ర, దేవకుమార్ మాదిగ, ఉప్పుటూరు బాలగురుస్వామి, ఏగూరు చంద్రశేఖర్, కోట రమేష్,టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోమశిల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన భోజ్య నాయక్



**అనంతసాగరం, జనవరి13ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం సోమశిల ప్రాజెక్ట్ సబ్ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా భోజ్యానాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీక రించా రు.ఎస్ఐ నెల్లూరు బాలాజీ నగర్‌లో విధులు నిర్వ హిస్తూ సోమశిలకు ఎస్పీ విజయారావ్ బదిలీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టపెడతానని, సోమశిల పోలీస్‌స్టేషన్ పరి ధిలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



**బిట్రగుంట, జనవరి 13 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో అనారోగ్యంతో మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం కల్పించినట్లు ఆదరణ కేంద్రం డైరెక్టర్ కె.సిం హాద్రిరావు తెలిపారు. ఈ మహిళ ఒంగోలు పట్టణంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతుండటంతో తాము ఆశ్ర యం కల్పించామని తెలిపారు.

# సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశం

**కొడవలూరు జనవరి 13 ప్రభాతవార్త** :కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని వైకాపా పార్టీ కార్యాల యం నందు శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయం కన్వీనర్ల మరియు రథస రదులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అదేశాలు మేరకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మండలంలోని ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను, ఇందులో ఖచ్చితంగా ఒక మహిళ ఉండే విధంగా నియమించాలని మండల సచివాలయ కన్వీనర్‌కు ఆయన సూచించారు. ప్రతి సచివాలయ కన్వీనర్ పర్య వేక్షణలో వాలంటీర్లు ఉంటారని తెలిపారు. ఒకవాలంటరీకు ఇద్దరు గ్రామ రథసారధులుగా ఒక మహిళను, ఒక పురుషుడిని తీసుకోవాలని తెలిపారు. ఈ గ్రామ రథసారధుల్లో ఒక్కరు ఖచ్చితంగా వాలంటీర్ల కుటుంబ సంబంధించిన సభ్యులై ఉండేలా నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలును, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డ చేసిన నియోజకవర్గం అభవృద్ధి కార్యక్రమాలను ప్రజకు తెలియజేసే బాధ్యత గ్రామ రథసారధులపై ఉంటుంది అన్నారు. ఈ గ్రామ రథసారధుల అభ్యర్థుల ఎంపికలో గ్రామఅభివృద్ధి



దృష్టిలో ఉంచుకొని, గ్రామ సర్పంచ్‌లు, నాయకులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీ నర్లు ఎంపిక చేయాలని కోరారు. అంతేకాక పార్టీకి బలోపేతం కావాలంటే వాలంటీర్లు, గ్రామరథసారధులు పాత్ర ముఖ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, మండల సచివాలయం కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు కాకి శ్రీనివాసులు, కరిముల్లా, ఇసనాక సునీల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరుల పాల్గోన్నారు.

## భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి



**బిట్రగుంట, జనవరి 13 ప్రభాతవార్త** బోగోలు మండలంలో పంట భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని కావలి ఆర్డీవో శీనానాయక్ ఆదేశించారు. మండలంలోని జక్కేపల్లిగూడూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వేని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో పాల్గొనే టీం సభ్యులు రైతులకు ముందు సమాచారం అందించి వారి వద్ద డాక్యుమెంట్లు పరిశీలించి రోజుకు 50 ఎకరాల వంతున సభ్యులు ఒక్కొక్కరు సర్వే చేయాలని సూచించారు. ఆయన వెంట మండల తహశీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద పిల్లల్ని ఆదుకోవడం సంతోషంగా వుంది



**కావలి రూరల్, జనవరి 13 ప్రభాతవార్త** సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో వున్న పేద పిల్లలను ఆదుకోవడం చాలా సంతోషంగా వుందని డాక్టర్ సతీష్ తెలిపారు. కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాయంలో శుక్రవారం సంస్థ సంరక్షణలో వున్న 18 మంది పిల్లలకు నెల వారీ నిత్యావసర వస్తువులు, బియ్యం, పోస్టాఫీసులో ప్రతి నెల వెయ్యి రూపాయలు డిపాజిట్ చేస్తున్న పుస్తకాలను ముఖ్య అతిధిగా పాల్గొన్న డాక్టర్ బి.సతీష్,ఆయన కుమార్తె బి.అర్పిత, సంస్థ ఉపాధ్యక్షులు బుర్లా రఘుకుమార్‌రెడ్డి , అధ్యక్షులు గంగపట్నం సురేంద్రలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా కావలి పట్టణం, పరిసర ప్రాంతాలలో తల్లిదండ్రులు లేని పిల్లల్ని అక్కునచేర్చుకొని వారిని సంరక్షకుల వద్దనే వుంచి ప్రతి నెల వారికి అవసరమైన నిత్యావసర వస్తువులు, నగదు డిపాజిట్, పిల్లలకు ఉచితంగా ట్యూషన్‌లు చెప్పడం అభినందనీయమన్నారు. నిరాదారణకు గురైన పిల్లల్లో ఒకరిని తాము కూడా సంరక్షణ బాధ్యత తీసుకోవడం చాలా ఆనందంగా వుందన్నారు. ఇటువంటి పిల్లలను గుర్తించి దాతలకు తెలియజేసి వారి ద్వారా సంరక్షణ ఏర్పాటు చేస్తున్న సంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర కృషి అభినందనీయమని తెలిపారు. కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## గీతాంజలిలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త** : కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో అందమైన రంగవల్లులతో తీర్చిదిద్ది సాంప్రదాయ వస్త్రధారణల్లో విద్యార్థినీ విద్యార్థులు కనువిందుగావించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో గత దశాబ్దాల కాలంగా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తమ కళా శాల సాంకేతిక విద్య, సంస్కృతి సాంప్రదాయాల సమ్మేళనమని తెలియజేశారు. తెలుగు సాంప్రదాయాలు , సంస్కృతి పట్ల సంపూర్ణమైన అవగాహన కల్పించడమే ఈ సంక్రాంతి సంబరాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సంక్రాంతి సంబరాల్లో ఆధ్యాత్మికతతో పాటుగా ఆరోగ్య రహస్యాలు కూడా ముడిపడి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. అనంతరం విద్యార్థుల కొరకు తగ్ ఆఫ్ వార్, గాలిపటాల పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి పి. శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై. విజయ్ శంకర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ కుమార్‌లు విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాశాల అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. కుమార్,ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి. రవికుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.




## మర్రిపాడులో ఘనంగా విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**మర్రిపాడు,జనవరి13ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మర్రిపాడులో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగాజరిగాయి. 50కేజీల కేక్‌ను కట్‌చేసి, బాణాసంచా పేల్చి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైసిపి మండల కన్వీనర్ బొర్రా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలో 95శాతం అమలు చేశారన్నారు. పేదలకు పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా పెన్షన్‌ను 2750రూపాయలకు పెంచి అవ్వ, తాతల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయం సాధించిన తర్వాత మండలంలో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకొని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నా రన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మంత్రిగా చూడాలన్నాదే తమ ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ కన్నపురెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, మండల వైసిపి నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, తూమాల మాధవరెడ్డి, గంగినేని రవీంద్రబాబు, ఉల్లగంటి శ్రీనివాసులురెడ్డి, జయరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, గువ్వల వెంగళరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ఏపిలగుంట

## అట్టహాసంగా బుచ్చి ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం





**బుచ్చి జనవరి 13 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం గుత్తికొండ శ్రీరాములు డిగ్రీకళాశాల ప్రాంగణంలో బుచ్చి ప్రీమియర్ లీగ్ బిపిఎల్,టి-10 సీజన్-త్రీ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను సీనియర్ క్రీడాకారులు టిడిపి నాయకులు బండ్ల కొండయ్య,కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ ప్రారంభించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నిలయ్‌కుమార్,రామకిషోర్‌రెడ్డి, కుమార్‌రాజా, రమణారెడ్డి,కృష్ణ చైతన్య కాలేజి ప్రిన్సిపాల్ చిరంజీవి వ్యవహారించారు.ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతు ఏటా ఇటువంటి క్రీడలను నిర్వహిస్తు యువతను ప్రోత్సహించడం అబినందనీయమని అన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు,ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈకార్యక్రమం నిర్వహకులుగా రాజేంద్ర, శ్రీనురెడ్డి, భాస్కర్ వ్యవహారించారు.

## సంక్రాంతి సందర్భంగా స్లో సైక్లింగ్ పోటీలు



**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులోని మైథిలి సెంటర్ ప్రాంతంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ది ప్రభావతి మెమోరియల్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్లో సైక్లింగ్ పోటీలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు పి. తన్మయ్, తేజా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ పోటీలను యువతను ఉత్సాహ పరిచేందుకు నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మెమెంటోలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 949 1502765 , 9182525319 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

## కోటంరెడ్డి ఆదేశాలతో క్రికెట్ పోటీలు




**నెల్లూరు జనవరి 13, ప్రభాతవార్త-వైద్యం** ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో సిటీ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు క్రికెట్ పోటీలను జరిగాయి. ఈ పోటీలను 53, 54 క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు జహీర్, మామిడాల.మధు, బీసీసెల్ అధ్యక్షుడు కప్పిర.శ్రీనివాసులు, పిట్టి.సత్యనాగేశ్వరరావు, కువ్వారపు.బాలాజీ, ప్రశాంత్ కిషోర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా యువకులకు ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లే ఈసారి కూడా కోటంరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. పండగ సందర్భంగా ఇంటికి వచ్చిన యువతంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి కోటంరెడ్డి హాజరు అవ్వాల్సిందని, అయితే ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని వివరించారు. జహీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో స్థానికులు వాసు, మౌళి, షమీమ్, ఖాదర్‌భాషా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా 98 వ గ్రిగ్ మోమెరియల్ టోర్నమెంట్



**రాపూరు జనవరి 13 ప్రభాతవార్త** మండలకేంద్రమైన రాపూరులో ఫిబ్రవరి 8 వ తేది నుండి 10 వ తేది వరకు నెల్లూరు జిల్లా సెకండరీ స్కూల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ గేమ్స్ నిర్వహించనున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ టోర్నమెంట్‌లో భాగంగా ఫిబ్రవరి 8,9,10 తేదిలలో జోనల్ స్థాయిలో ఫిబ్రవరి 15,16,17 తేదిలలో జిల్లా స్థాయిలో క్రీడా సంబరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ పోటీలలో జిల్లా నుండి షుమారు వెయ్యిమంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.క్రీడలకు వచ్చే టీంలకు స్పోట్స్ డ్రస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు కావల్సిన బోజన వసతి సౌకార్యలకు సంబంధించిన విషయాలపై వ్యాయామోపాధ్యాయులతో చర్చించారు.రాపూరులోని ప్రభుత్వ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలతోపాటు,ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో విద్యార్థులకు వసతి మరియు క్రీడా మైదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.క్రీడాకారులకు కావల్సిన వసతి సౌకర్యాలపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో ఎంపిపి చెన్ను బాలకృష్ణారెడ్డి,పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు,ఇంజనీరింగ్ అధికారులు తదితరులు న్నారు.

## మండలాభివృద్దికి అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలి



**రాపూరు జనవరి 13 ప్రభాతవార్త** మండలంలో జరుగుతున్న అభి వృద్ది సంక్షేమపథకాలు అమలకు అధికారులు పూర్తి స్థాయిలో సహ కరించాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం రాపూరు ఎంపిపి చెన్నూ బాలకృష్ణారెడ్డి అద్యక్షతనమండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు శాఖల వారిగా నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మండల సమావేశంలో చర్చించాల్సిన అజెండాలోకి సంబంధించిన నివేదికలను సమావేశానికి వచ్చేటప్పుడు ముందుగా ప్రజాప్రతినిదులకు అందించాలని కోరారు. అయితే అధికారులు ఈ నివేదికలు అందించడంలో అలసత్వం వహిస్తున్నారని దీనిని విడనాడాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో రాపూరు ఎఎబి చైర్మన్ నెల్లూరు రవీంద్రరెడ్డి,సొసైటీ చైర్మన్ చెన్ను భాస్కర్‌రెడ్డి,వైసిపి మండల కన్వీనర్ నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, తహసిల్దారు శ్యామ్ సుందర్‌రాజు, ఎంపిడిఒ ఆమోష్‌బాబు, పలువురు ఎంపిటిసిలు గ్రామ సర్పంచ్‌లు పెద్దఎత్తున వైసిపి నాయకులు,వివిద శాఖల అధికారులు హాజరైయ్యారు.

## ఘనంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు,జనవరి13ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆత్మకూరులో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆత్మకూరు పట్టణంలోని న్నపూర్ణాసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సుల్తాన్‌షాహిద్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆత్మకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి వేడుకలను నిర్వహించారు.

**మున్సిపల్ కార్యాలయంలో** మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం, అధికారులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌టచేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు , అధికారుల ఆధ్వర్యంలో విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ పరిధిలో 3వ వార్డు ఎస్టీ కాలనీలో సోషల్‌మీడియా నియోజకవర్గ కన్వీనర్ బాలఅంకయ్య ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

## ఘనంగా మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదినవేడుకలు



**అనంతసాగరం,జనవరి13ప్రభాతవార్త:** మండలంలోని బొమ్మవరం అగ్రహారం లో గ్రామ సచివాలయంలో శుక్రవారం వైసిపి నాయకులు అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు.అనంతరం దివ్యాంగులకు, అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం ఏర్పా టు చేశారు. ఈసందర్భంగా అంకిరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజక వర్గం అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఈసందర్భం గా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వింజమూరు,జనవరి13ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడి మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తరలిస్తున్న లోపే వ్యక్తి మృతిచెందిన సంఘటన వింజమూరు మండలం ఊటుకూరు రోడ్డు డైవర్షన్ దగ్గర శుక్ర వారం చోటు చేసుకుంది. నందిగుంట గ్రామానికి చెందిన మీసాల బ్రహ్మయ్య కుమారుడు మీసాల సుధాకర్ (23) తమ అత్తగారి గ్రామమైన నందిపాడు నుండి దుత్తలూరు మీదుగా నందిగుంటకు వస్తూ ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న హైవేరోడ్డు ఊటుకూరు సమీపంలోని డైవర్షన్ వద్ద ప్రమాదవశాత్తు అక్కడ తీసి ఉన్న కల్వర్టు గుంటలో పడిపోవడంతో సుధా కర్ తలకు బలమైన గాయమైంది. ఆమార్గంగుండా ప్రయాణిస్తున్న కొందరు గమనించి వింజమూరు పోలీసులకు సమాచారం అందజేయగా ఎస్ఐ జంపానికుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరు కొని ప్రమాదానికి గల కారణాలను సేకరించారు .బాధిత కుటుంబ సభ్యులు మాత్రం రోడ్డు నిర్వాహకులవలనే తమ కొడుకు ప్రమాదానికి గురయ్యాడని వాపోతున్నారు.

## అట్టహాసంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**సంగం జనవరి 13 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు అట్టహాసంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కేకును కట్ చేసి ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నాయకులు మాట్లాడుతు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మరెన్నో జన్మదినోత్సవాలు ఆనందోత్సహాలతో జరుపుకోవాలని వారు కాంక్షించారు.ఈకార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి,జడ్‌పిటిసి రావుల లక్ష్మి, కంటాబత్తిన రఘునాదరెడ్డి, కోటురమణారెడ్డి,ఆనం ప్రసాద్‌రెడ్డి, దువ్వూరు బ్యాంకు చైర్మన్ కొల్లి శ్రీ దర్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి,మాజీ జడ్‌పిటి సి దేవసహాయం, సర్పంచ్‌మానికల చందు, ఫణేంద్రరెడ్డి ,చందు,పట్టాభి,లేబూరు మోహన్‌రెడ్డి, చేవూరు శ్రీనివాసులురెడ్డి,పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి ,దువ్వూరు మదన్‌మోహన్‌రెడ్డి,ఎంపిటిసి సభ్యులు ముడి మల్లికార్జునరెడ్డి,నెల్లూరు కోటా రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ మన్సూర్,కరకంబాకం శంకరయ్య,మాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి శుభాకంక్షలు తెలిపిన నేతలు

**కందుకూరు,జనవరి13,ప్రభాతవార్త** నియోజకవర్గ ప్రజలకు వివిధ పార్టీ నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.శాసనసభ్యుడుమహీధర్‌రెడ్డి తెలుగువారి సాంప్రదాయమైన భోగి, సంక్రాంతి,కనుమ పండుగలు ఇంటిల్లపాదిజరుపుకోవాలని కోరారు.టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సంక్రాంతికి సుఖసౌఖ్యాలతో తులతూగాలనిఆకాంక్షించారు. మాజీ శాసనసభ్యులు దివిశివరాం, పోతుల రామా రావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ప్రజలు భోగభాగ్యాలతో జీవించాలని కోరారు.

## మట్టి మాఫియాపై ఎస్సై మెరుపు దాడి

**కోవూరు, జనవరి 13 ప్రభాతవార్త :** కోవూరులోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారు జామున కోవూరు ఎస్సై డి. వెంకటేశ్వరరావు సీజ్ చేశారు. సీజ్ చేసిన మూడు ట్రాక్టర్లను కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికే పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని తరలించడం వలన ఇటీవల పెన్నానదికి వరదలు వచ్చిన సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న దేవాలయం కూడా పూర్తిగా ధ్వంసం కావడం జరిగింది. ఈ మూడు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

